స్టేడియంలో సంబురాలు



చందానగర్: ఒలింపిక్స్‌లో ఇండియా హాకీ జట్టు గెలుపుపై తెలంగాణ రాష్ట్ర హాకీ అసోసియేషన్ అధ్యక్షులు కొండ విజయ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. చందానగర్ పీజేఆర్ స్టేడియంలో క్రీడాకారులతో కలిసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కోచ్‌లు నవీన్, మహేష్, లక్ష్మణ్, శ్రీకాంత్, వెంకటేష్, రవి, క్రీడాకారులు, చిన్నారులు పాల్గొన్నారు.

మెరిడియన్ స్కూల్‌లో 'మోడల్ యునైటెడ్ నేషన్'



మాదాపూర్: మాదాపూర్ మెరిడియన్ స్కూల్‌లో శుక్రవారం మోడల్ యునైటెడ్ నేషన్ (నమూనా ఐక్యరాజ్యసమితి) సమావేశాలను నిర్వహించారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన 7,8వ తరగతి విద్యార్థులు 425 మంది ఈ సదస్సులో పాల్గొన్నారు. విద్యార్థులు వివిధ దేశాల ప్రతినిధులుగా వ్యవహరిస్తు ఆయా దేశాల్లోని సమస్యలను సవాళ్లను ప్రస్తావించారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ, డ్రగ్స్, నేరాలు తదితరాలపై మూడు రోజుల పాటు ఈ సమావేశాలను నిర్వహిస్తున్నట్టు పాఠశాల సీఈఓ అమోఘ్ బుట్టా తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ భవాని పాల్గొన్నారు.



గంగారం జేపీ సినిమాస్ వద్ద జీహెచ్‌ఎంసీ ఎఫ్‌ఓబీ

ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు.. పట్టించుకోరేం..?

నిర్మించారు.. నిర్వహణ మరిచారు

- పనిచేయని ఎస్కలేటర్లు
- అపరిశుభ్రంగా ఎఫ్‌ఓబీలు

చందానగర్: జాతీయ రహదారిపై పాదచారులు రోడ్డు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను నిర్మించారు. ముంబై జాతీయ రహదారిపై మియాపూర్ నుంచి చందానగర్ వరకు 5 ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను మియాపూర్ చౌరస్తా, ఆల్విన్ కాలనీ చౌరస్తా , మదీనాగూడ దీప్తిశ్రీనగర్ వద్ద, గంగారం జేపీ సినిమాస్ ముందు జీహెచ్‌ఎంసీ నిధులతో కోట్లు వెచ్చించి నిర్మించడం జరిగింది. చందానగర్ ప్రధాన కూడలి వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి పనులు ప్రారంభించినప్పటికీ ఫ్లైఓవర్ నిర్మాణ పనులతో నిలిచిపోయింది. ఈ ఫుట్‌ఓవర్ బ్రిడ్జిల నిర్వహణ సరిగా లేకపోవడంతో అపరిశుభ్రంగా తయారయ్యాయి. ఇక కొన్నిచోట్ల ఎస్కలేటర్లు పనిచేయకపోవడంతో ప్రజల అవస్థలు అన్నీఇన్నీ కాదు.

- ప్రజల సౌకర్యార్థం ముంబై జాతీయ రహదారిపై 5 ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు నిర్మించారు
- జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్మించిన వాటికి మాత్రం ఇరువైపులా ఎస్కలేటర్లు, లిఫ్టులు ఏర్పాటు చేశారు. నిర్వహణ అంతంత మాత్రంగా ఉందని ప్రజలు వాపోతున్నారు
- ప్రైవేట్ సంస్థలు నిర్మించిన రెండు ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలకు ఎస్కలేటర్లు లేవు. కేవలం లిఫ్టులు మాత్రమే ఉన్నాయి. ఐతే వాటి నిర్వహణను పట్టించుకునే వారు లేరు
- లిఫ్టుల ముందు చెత్త చెదారం, మెట్ల వద్ద గుంతలు, బ్రిడ్జి గోడలకు పోస్టర్లు అతికించారు.
- పాదచారుల కోసం ప్రత్యేకంగా నిర్మించినా నిర్వహణ లేకపోవడంతో ఎఫ్‌ఓబీలకు స్పందన అంతంతగానే ఉంది.
- జన సందోహం, షాపింగ్‌మాల్స్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మిస్తే ఉపయోగమని స్థానికులు అంటున్నారు
- జాతీయ రహదారిపై పాదచారులు జీబ్రా క్రాసింగ్ ద్వారానే ఎక్కువగా వెళ్తున్నారు. కానీ రాత్రి సమయాలలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.
- సూచిక బోర్డులు లేక పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.
- ఇక బ్రిడ్జి మెట్లు, లిఫ్టులు, ఎస్కలేటర్ల వద్ద ఇష్టానుసారంగా చిరు వ్యాపారులు డబ్బాలు ఏర్పాటు చేసుకున్నారు.



గంగారం జేపీ సినిమాస్ వద్ద జీహెచ్‌ఎంసీ ఎఫ్‌ఓబీ మెట్ల మార్గం వద్ద పెద్ద గుంత



ఆల్విన్ కాలనీ చౌరస్తాలో..



దీప్తిశ్రీనగర్ వద్ద ఎస్కలేటర్ పనిచేయక పోవడంతో మెట్లు ఎక్కుతున్న దృశ్యం

బ్రిడ్జి వద్ద సిబ్బందిని ఏర్పాటు చేయాలి



మియాపూర్ నుంచి గంగారం వరకు ఉన్న నాలుగు ఫుట్‌ఓవర్ బ్రిడ్జిల వద్ద ఎస్కలేటర్‌పై వెళ్లాలంటే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఎస్కలేటర్ల వద్ద సిబ్బందిని ఏర్పాటు చేయాలి. – కృష్ణ ముదిరాజ్, హఫీజ్‌పేట్

ఉన్నతాధికారులు దృష్టి సారించాలి



ఫుట్‌ఓవర్ బ్రిడ్జిల వద్ద లిఫ్టులు, ఎస్కలేటర్లపై చెత్త చెదారం పడేస్తున్నారు. ఇష్టానుసారంగా పోస్టర్లు అతికిస్తున్నారు. మెట్ల వద్ద గుంతలు ఏర్పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికై నా ఉన్నతాధికారులు దృష్టి సారించాలి.

– రామస్వామి యాదవ్, మాజీ కౌన్సిలర్

ఔషధ రూపకల్పన ప్రక్రియను మెరుగుపరచాలి

హెచ్‌సీయూలో డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్

రాయదుర్గం: ఔషధ రూపకల్పన ప్రక్రియను మెరుగుపర్చడానికి క్వాంటం మెకానిక్స్, ఏఐ ఏకీకరణ అవసరమని రేషనల్ ల్యాబ్స్ సీఈఓ, చైర్మన్ డాక్టర్ రామిరెడ్డి ముత్యాల పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్స్, హెచ్‌సీయూ, సైన్స్ గురుస్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సాంప్రదాయ ఔషధ ఆవిష్కరణ పద్ధతుల్లోని లోపాలపై చర్చించారు. కంప్యూటర్ ఎయిడెడ్ డ్రగ్ డిజైన్ (సీఏడీడీ) అభివృద్ధిలో ఎలా కీలకంగా ఉందో వివరించారు.ఇన్‌సిలికో మైండ్స్ వ్యవస్థాపకుడు, సీఈఓ డాక్టర్ నిర్తిన్ దేవిరెడ్డి, ఇన్‌సిలికో మైండ్స్ సీఎస్‌ఓ ప్రణవ్ మాట్లాడారు.

క్లిష్టమైన ఆరోగ్య సమస్యలకు పరిష్కారమే లక్ష్యం



రాయదుర్గం: పిల్లల జీవితాలపై అర్థవంతమైన ప్రభావాన్ని చూపడానికి, పుట్టుకతో వచ్చే గుండె జబ్బుల వంటి క్లిష్టమైన ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని కేర్ ఆస్పత్రుల గ్రూప్ సీఈఓ జస్దీప్‌సింగ్ స్పష్టం చేశారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ హబ్‌లో కేర్ ఆస్పత్రుల గ్రూప్, కో నెక్సస్, జగతి ఫౌండేషన్ సంయుక్తంగా పేద పిల్లలలో పుట్టుకతో వచ్చే గుండెజబ్బులకు చికిత్స చేయడానికి అంకితమైన సీఎస్‌ఆర్ కార్యక్రమం 'నాన్హీ..దిలో కా సఫర్' ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టుకతో వచ్చే గుండె జబ్బుల వంటి క్లిష్టమైన ఆరోగ్య సమస్యలను పరిష్కరించడంలో సహకారం అందిస్తామన్నారు. టీహబ్ సీఈఓ శ్రీనివాసరావు మహంకాళి మాట్లాడుతూ నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలన్నారు.

శేరిలింగంపల్లిలో టెన్నిస్ సింథటిక్ కోర్టులు

ప్రారంభించిన తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చైర్మన్ మన్నె సతీష్



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలోని లేగల స్పోర్ట్స్ ఎరీనాలో నూతనంగా ఏర్పాటు చేసిన టెన్నిస్ సింథటిక్ కోర్టులను తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చైర్మన్ మన్నెసతీష్, వ్యవస్థాపకులు లేగల రమేష్‌రెడ్డితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులను చదువుతోపాటు క్రీడల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి బీజేపీ నాయకులు ఎల్లేష్, అకాడమీ నిర్వాహకులు కోలశ్రీనివాస్, నాయకోటి సాయిరామ్‌రావుతో పాటు పలువురు క్రీడాకారులు, స్థానికులు పాల్గొన్నారు.

9 మందికి జరిమానా.. ఒకరికి జైలు

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 9 మందికి రూ.2 వేల చొప్పున జరిమానా, ఒకరికి జరిమానాతో బాటు రెండు రోజుల జైలు శిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 10 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా, జడ్జి 09 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున జరిమాన, ఒకరికి రూ. 2 వేల జరిమానతో పాటు రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి

- జిల్లా కలెక్టర్ క్రాంతి
- పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ



ప్రభుత్వ ఆసుపత్రిలో మెడిసిన్ చార్ట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు ఎక్కువగా జరిగేటట్లు చూడాలని, వర్షాకాలం సీజనల్ వ్యాధులు వ్యాపించే కాలం కాబట్టి వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి సూచించారు. శుక్రవారం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆస్పత్రిలో మందుల నిలువ గది, ఇన్ పేషంట్ వార్డు , ల్యాబ్ తదితర విభాగాలను తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అందుతున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని వైద్యాధికారికి సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌ఎంఓ ప్రవీణ ,కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక ఉద్యమ చైతన్యాన్ని పెంచే 'యాలై పూడ్సింది'

హెచ్‌సీయూ తెలుగుశాఖ మాజీ అధ్యక్షుడు ఆచార్య వెంకటేశ్వరరావు

రాయదుర్గం: సామాజిక ఉద్యమ చైతన్యాన్ని పెంచే కవితా సంపుటి 'యాలై పూడ్సింది' అని హెచ్‌సీయూ తెలుగుశాఖ మాజీ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ నుంచి ఆన్‌లైన్ ద్వారా ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న 'టాక్ ఆఫ్ ది బుక్' శుక్రవారం ఆయన ఆన్‌లైన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మక శక్తి, సమకాలీన సాహిత్యం పట్ల ఆసక్తి పెంపొందించడానికి టాక్ ఆఫ్ ది బుక్ కార్యక్రమం ఎంతో దోహద పడుతుందన్నారు. ఈ కవిత్వాన్ని చదవడం ద్వారా మన చుట్టూ ఉండే మనుషుల మధ్య ప్రేమాభిమానాలు పెరగడంతోపాటు అన్ని వృత్తుల వారి పట్ల గౌరవం పెరుగుతుందన్నారు. పుట్టిన ఊరు, పరిసరాలను ప్రేమించడంలో గల ఆత్మీయతలు ప్రతిఒక్కరికీ తెలుస్తాయని అటువంటి కవితలు రాసిన కవి నాగరాజు అభినందనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాఖ్యాతగా ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి అకడమిక్ అధికారి శ్రీరంగం వ్యవహరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శివసాయిక్షేత్రంలో రుద్రహోమం



రుద్రహోమంలో పాల్గొన్న భక్తులు



రాయదుర్గం: శ్రావణ మాసం శుక్రవారంను పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని చంద్ర మౌళీశ్వర స్వామి ఆలయంలో రాజేశ్వరి మాతకు, అన్నపూర్ణాదేవికి పూజలు అభిషేకాలు చేశారు.

ఘనంగా నాగపంచమి

రాయదుర్గం: నాగపంచమిని పురస్కరించుకొని మహిళలు పూజలు చేశారు. రాయదుర్గం, గచ్చిబౌలి, నానక్‌రాంగూడ, ఖాజాగూడ, గోపన్‌పల్లి, గౌలిదొడ్డి, ఇందిరానగర్, కొండాపూర్, సాయిఐశ్వర్య, మధురానగర్ ప్రాంతాలలో ఆలయాల్లో ప్రతిష్ఠించిన నాగ దేవతల విగ్రహాలకు పాలాభిషేకం చేశారు.



రాయదుర్గంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజ చేస్తున్న మహిళలు

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

పటాన్‌చెరు: డివిజన్ పరిధిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి శుక్రవారం కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. పటాన్‌చెరు మండలం, పటాన్‌చెరు డివిజన్, రామచంద్రాపురం మండలాలకు చెందిన 271 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా మంజూరైన 2 కోట్ల 71 లక్షల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, తహసీల్దార్ రంగారావు, సంగ్రాం పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

వన మహోత్సవం.. మొక్కలు పంపిణీ



కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

చందానగర్: భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటి పెంచాలని చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని శివాజీనగర్, రాజేందర్‌రెడ్డినగర్‌లలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి కోరారు. స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట మొక్కలు నాటారు.

ఆల్విన్‌కాలనీలో..

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబీర్ చెరువు వద్ద వన మహోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ, హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, డీసీ కృష్ణయ్య, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శ్రీ వాత్సవ్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మమత, జీహెచ్‌యంసీ ఉన్నతాధికారులు పాల్గొని మొక్కలు నాటి, పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ ఇందసేన ,ఏఈ రాజీవ్, విశ్వం, ఎస్‌ఆర్‌పీ సత్యనారాయణ, హార్టికల్చర్ దాసు, ఎంటమాలజీ సూపర్‌వైజర్ నరసింహ పాల్గొన్నారు.

స్టాలిన్‌నగర్ కాలనీలో..

మియాపూర్: మియాపూర్ డివిజన్ స్టాలిన్‌నగర్ కాలనీలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ,అధికారులు, కాలనీవాసులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఈ దుర్గాప్రసాద్, వార్డు ఆఫీసర్ కృష్ణ, స్థానిక నాయకులు రాణి, వెంకటేష్, శ్యామల దేవేందర్, భాగ్యమ్మ పాల్గొన్నారు.

రాయదుర్గంలో..

రాయదుర్గం: వనమహోత్సవంలో భాగంగా రాయదుర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గోపన్‌పల్లితండాలోని జీహెచ్‌ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్ రెడ్డి మొక్కలు నాటారు. తర్వాత స్థానికులకు మొక్కలను పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



గచ్చిబౌలి: విద్యుత్ సంబంధిత మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ రాజశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గోపాల్‌రెడ్డినగర్, రాఘవేంద్ర కాలనీ ఏ,బీ బ్లాక్‌లు, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3.30 గంటల వరకు గాయత్రి లేఅవుట్, కాంతివనం, సెంట్రల్ పార్క్ ఫేజ్-2, శిల్పా వ్యాలీ, మాధవహిల్స్, జేవీజీహిల్స్, మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఇజ్జత్‌నగర్, అలేఖ్య అపార్ట్‌మెంట్స్, న్యాక్ మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

వైట్ ఫీల్డ్ పరిధిలో..

వైట్‌ఫీల్డ్ సబ్‌స్టేషన్ పరిధిలో.. శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు రాజీవ్‌నగర్, వడ్డెర బస్తీ, రోలింగ్‌హిల్స్, అంజయ్యనగర్, బాబుఖాన్ లేన్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మియాపూర్‌లో..

మియాపూర్: గోకరాజు, రెడ్డి కాలనీ, ప్రశాంత్‌నగర్, శ్రీలాగార్డెన్, లక్ష్మీనగర్, రాంనరేష్‌నగర్, గౌతమీనగర్, బృందావనీ కాలనీ ఫీడర్‌ల పరిధిలో.. శనివారం ఉదయం 10.30 నుండి 11 గంటల వరకు గోకరాజు కాలనీ కళాశాల, మయూరినగర్ పార్క్, గోకరాజు 11 గంటల నుండి 11.30ల వరకు రెడ్డి కాలనీ, బీకేఎన్‌క్లేవ్, 11 గంటల నుండి 12 గంటల వరకు ప్రజాప్రతి అపార్ట్‌మెంట్, మయూరినగర్ పార్క్, ప్రశాంత్‌నగర్, 11.30 నుండి 12 గంటల వరకు శ్రీలా గార్డెన్ రోడ్డు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు స్ట్రీట్, మయూరినగర్ పార్క్, లక్ష్మీనగర్, మధ్యాహ్నం 12 గంటల నుండి 12.30ల వరకు రాంనరేష్‌నగర్, వర్టెక్స్ అపార్ట్‌మెంట్, ఓల్డేజ్ హోం, మిత్ర హిల్స్, మధ్యాహ్నం 1 గంట నుండి 1.30 వరకు గౌతమీనగర్, శ్రీనివాస్‌కాలనీ, బృందావన్ కాలనీ, హైదర్‌నగర్, 2 గంటల నుండి 3 గంటల వరకు రాంనరేష్‌నగర్, ఓల్డేజ్‌హోం, మిత్రహిల్స్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ హరీష్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు.

మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో..

మియాపూర్ ఆర్టీసీ కాలనీ, హెచ్ఎంటీ, పీఎస్‌ఆర్‌హిల్స్, స్వర్ణపురి కాలనీ ఫీడర్ మరమ్మతుల కారణంగా.. ఉదయం 10.30 నుండి 11 గంటల వరకు లేక్‌వ్యూ అపార్ట్‌మెంట్, బాలాజీనగర్, ఆర్‌బీఆర్ కాంప్లెక్స్, అంగార హోటల్, 11 గంటల నుండి 11.30 గంటల వరకు ఆర్టీసీ కాలనీ, శిల్పాలేఅవుట్, బాలాజీ లేఅవుట్, మధ్యాహ్నం 12 గంటల నుండి 12.30 గంటల వరకు కృషినగర్, ఎంఏనగర్, స్టాలిన్‌నగర్, స్వర్ణపురి కాలనీ, పీఎస్‌ఆర్ హిల్స్, హెచ్ఎంటీ కాలనీ, మ.1 గంట నుండి 1.30 వరకు మక్త, హెచ్ఎంటీ కాలనీ, స్వర్ణపురి కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు.

వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో..

చందానగర్: వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

- కెఎస్ఆర్ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, కెఎస్ఆర్ ఎన్‌క్లేవ్ రోడ్డు నెంబర్ 1 నుంచి 10 వరకు, హంగర్ హబ్, అపర్ణ రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

చందానగర్ సబ్ స్టేషన్ పరిధిలో..

- పాపిరెడ్డి కాలనీ, హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రేమ్‌నగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు ప్రేమ్‌నగర్ వెనుకవైపు, 100 ఫీట్ రోడ్డుకు ఇరువైపుల, హఫీజ్‌పేట్, మార్తాండనగర్, ప్రేమ్‌నగర్ బి బ్లాక్, హనీఫ్ కాలనీ ప్రాంతాలలో
- మార్కెట్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు ప్రేమ్‌నగర్ వెనుక వైపు, రోలింగ్ మిడోస్, సీఎం తోట వైపు, 100 ఫీట్ రోడ్డుకు ఇరువైపులా ప్రాంతాలలో..
- ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 12.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ, సప్తగిరి కాలనీ, బీహెచ్‌ఈఎల్ హెచ్‌ఐజీ, మైత్రీనగర్ ఫేజ్ 1,2,3 ప్రాంతాలలో..
- వైశాలీనగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి ఉదయం 11.00 గంటల వరకు వైశాలీ నగర్, ఉషోదయ ఎన్‌క్లేవ్, మంజీరా పైప్‌లైన్ రోడ్డు, ఏపీఎన్‌జీఓ కాలనీ ప్రాంతాలలో..

హఫీజ్‌పేట్ సబ్ స్టేషన్ పరిధిలో..

- విశ్వంభర ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు విశ్వంభరా, శిల్పా ఎవెన్యూ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.
- హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి 11.00 గంటల వరకు ఓల్డ్ హఫీజ్‌పేట్, సాయినగర్, యూత్ కాలనీ, వార్డు ఆఫీస్ ఏరియాలలో..
- మైత్రీనగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి 11.30 గంటల వరకు జనప్రియనగర్ ఫేజ్ 1,2,3,4,5, ఆల్విన్ కాలనీ క్రాస్ రోడ్డు ఏరియాలలో..
- కల్యాణ్ గార్డెన్స్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 12.00 గంటల నుంచి 2.00 గంటల వరకు మాధవనగర్, అంబేద్కర్‌నగర్, నందినగర్ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

నల్లగండ్ల హుడాకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో..

శేరిలింగంపల్లి: లక్ష్మీవిహార్ 11 కేవీ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.30 గంటల నుంచి 1 గంట వరకు లక్ష్మీవిహార్ ఫేజ్-1, ఫేజ్-2 కాలనీలతో పాటు డాక్టర్స్ కాలనీ, నల్లగండ్ల విలేజ్‌లలో విద్యుత్ సరఫరా ఉండదని నల్లగండ్ల ఏఈ వెంకటనారాయణరెడ్డి తెలిపారు.

- 11 కేవీ ఎపిస్టిమో గ్లోబల్ ఫీడర్ పరిధిలో.. మ 1.30 గంట నుంచి 3 గంటల వరకు నల్లగండ్ల- తెల్లాపూర్ రోడ్డు, ఎపిస్టిమో స్కూల్ ఏరియా, సాధన స్కూల్ బ్యాక్ సైడ్ ఏరియాల్లో ..
- 11 కేవీ గోపన్‌పల్లి ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 1 గంట నుంచి 2 గంటల వరకు గోపన్‌పల్లి తండా, గోపన్‌పల్లి తదితర ప్రాంతాల్లో..
- 11 కేవీ గుల్‌మోహర్‌పార్కు, బాపూనగర్ ఫీడర్ల పరిధిలో.. మ.12 గంటల నుంచి 12.30 వరకు గుల్‌మోహర్‌పార్కు కాలనీ, నేతాజీనగర్, బాపూనగర్, గోపీనగర్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని ఏఈ తెలిపారు.